www.ijmer.in
INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:9, ISSUE:12(8), December:2020

# మంగిపూడి వేంకట శర్మ గారి రుక్మిణి –ఒక పరిశీలన

డా.వి.కన్నం నాయుడు,లెక్చరర్,మహారాజ ప్రభుత్వ సంస్కృత కళాశాల,విజయనగరం

**కవి పరిచయం:**

శర్మగారు ఆధునిక యుగంలో కందుకూరి, చిలకమర్తి తర్వాత 3వ తరానికి చెందిన కవి. పశ్చిమ గోదావరి జిల్లా పిప్పర గ్రామంలో 1882 జనవరి 9న జన్మించారు. వీరు పెద్దగా చదువుకోకపోయినప్పటికీ పోతనలాగా సహజ పాండిత్యం కలిగినవారు. బాల్యం నుంచే కావ్యరచన ప్రారంభించి ఆధునిక యుగంలోని అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేశారు. వీరు సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినప్పటికీ సంస్కరణ దృక్పథం కలిగినవారు. హరిజనోద్ధరణ, స్త్రీ జనోద్ధరణ కాంక్షిస్తూ వారు అనేక రచనలు చేశారు. తెలుగు సాహిత్యంలో హరిజనోద్ధరణను కాంక్షిస్తూ రచనలు చేసిన వారిలో వీరు ప్రథములు. గాంధీజీ హరిజనోద్ధరణకు పూనుకోకముందే అస్పృశ్యతను నిరసిస్తూ "నిరుద్ధ భారతం" రాశారు. అస్పృశ్యత వల్ల భారతదేశ అభివృద్ధి నిరోధించబడిందని ఇందులో చెప్పారు. ఆనాడు స్త్రీల దయనీయ స్థితిని చూసి, వారి అభ్యున్నతిని కాంక్షిస్తూ "స్త్రీ ధర్మబోధిని, స్త్రీ నీతి కథామంజరి, బాల వితంతు విలాపం" మొ.న రచనలు చేశారు. సంఘ సంస్కరణ బాధ్యతను గుర్తించిన అద్భుతకవి శర్మగారు.

జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం ముమ్మరంగా జరుగుతున్నపుడు వాటిని ప్రబోధిస్తూ శర్మగారు అనేక గ్రంథాలు రాసారు. అంతే కాకుండా పత్రికల్లో వీటికి సంబంధించిన కవితా ఖండికలు, గేయాలు, వ్యాసాలు తరచుగా రాసి ఆంధ్రదేశంలో గొప్ప కవిగా ప్రసిద్ధి పొందారు. జాతీయోద్యమాన్ని ప్రబోధిస్తూ వీరు రాసిన "మేలుకొనుమీ భరతపుత్రుడ" అనే గేయం, తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోరుతూ చేస్తున్న ఆంధ్రోద్యమంలో నాయకుల మధ్య ఏర్పడిన ప్రాంతీయ భేదాలను ఖండిస్తూ వీరు రాసిన "జో ఆంధ్రపుత్రుడా! జో మహాఘనుడా! జో అసమర్థుడా! జో దంభ పరుడా!" అనే సుదీర్ఘమైన జోలపాట చాలా ప్రసిద్ధమైనవి.

**రుక్మిణీపరిణయం నాటకం:**

మంగిపూడి వేంకటశర్మగారు రుక్మిణీపరిణయం, పృథ్వీరాజు-తారాబాయి, వీరమతి, సహకారవిజయం, ధనాభిరామ, పుష్పవేణి అనే 6 నాటకాలు రాశారు. వీటిలో మొదటి నాలుగూ లభిస్తున్నాయి, చివరి రెండూ లభించలేదు. లభిస్తున్న నాలుగు నాటకాలూ చాలా వైవిధ్యభరితమైన ఇతివృత్తాలు కలిగినవి.

"రుక్మిణీపరిణయం" పౌరాణికం.భాగవతంలో దశమస్కంధంలోని 52వ అధ్యాయంలో 1677 పద్యం నుంచి మొదలుకుని 1784వ పద్యం వరకూ అంటే 107 గద్యపద్యాల్లో ఉంది(తెలుగువిశ్వవిద్యాలయం ప్రతి 1986). దీన్ని ఆధారం చేసుకుని శర్మగారు తన మిత్రుడైన ముట్నూరి సుబ్బారాయుడు గారితో కలిసి 5 అంకాల నాటకంగా రాశారు.ఇది శృంగారరసప్రధానమైన నాటకం.రుక్మిణీకృష్ణుల ప్రేమ,విరహం,వివాహం ఇందులో చెప్పబడింది. రుక్మిణీ పాత్ర గురించి కవులు ఈ నాటకం పీఠికలో ఇలా చెప్పుకున్నారు."ముగ్ధనాయికకు సహజములగు లజ్జ, వినయము,సహనము,తల్లిదండ్రులయందు భక్తి,సోదరునియందు విశ్వాసమూ రుక్మిణియందును

ఆశ్రితజనావనపరత్వము,బంధుప్రీతి, నిగ్రహానుగ్రహసమర్ధత,శ్రీకృష్ణునియందును,సోదరి సౌఖ్య సంపదల యందభిలాషతద్వివాహ నిర్ణయమున సదుద్దేశము రుక్మియందును,వర్ణింప నీ గ్రంథమున మా శక్తికొలంది ప్రయత్నించితిమి.అరాతిమారణ క్రియానుకూలంబగు శ్రీకృష్ణుని కరతల కరవాలము ప్రియబంధుజనుని మీసముల నపహరించుటకు వినియోగపడుట నశ్లీలముగా దలంచి మేమట్లు వర్ణింప మానితిమి."

**పోతన గారి రుక్మిణి:**

పోతన భాగవతంలో రుక్మిణి చిన్నప్పటినుంచి తండ్రి దగ్గరకు వస్తున్న అతిథుల వల్ల కృష్ణుని రూపం,సద్గుణాలు,శౌర్యపరాక్రమాలు విని అతన్ని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లుగా చెప్పబడింది.అంతేగాకుండా బంధువులు కూడా కృష్ణునికి రుక్మిణి,రుక్మిణికి కృష్ణుడు తగినవారని అనుకుంటూ ఉన్నప్పుడు దుర్మార్గుడు,మదాంధుడు అయిన రుక్మి,శ్రీకృష్ణుని పట్ల శతృత్వం ఉన్నవాడు కావడంచేత,తన చెల్లెలు రుక్మిణిని తన మిత్రుడైన శిశుపాలునికివ్వాలని సంకల్పించినట్లుగా,దానికి భీష్మకుడు ఎదురు చెప్పలేకపోయినట్లుగా ఉంది.( భాగవతంలో రుక్మి 'దుస్సంధుఁడు' అంటే దుష్టుడైన అంధుడుగా చెప్పబడ్డాడు.) విషయం గమనించిన రుక్మిణి అగ్నిద్యోతనుడనే ఒక విప్రుని పిలిపించుకుని రుక్మి దురుద్దేశాన్ని,తండ్రి అశక్తతను శ్రీకృష్ణునికి వివరించి,అతన్ని ఇక్కడికి తీసుకురావాలని చెప్పి పంపించింది.రుక్మిణి కొన్ని రహస్యపు మాటలు కూడా చెప్పినట్లు పోతన రాశారు.క్షత్రియ కన్యలు సాహసవంతులు.అవసరం వచ్చినపుడు వారు సాహసించి తమ మనోరథం సాధించుకోవడానికి గట్టి ప్రయత్నం చేస్తారు.భాగవతంలోని రుక్మిణి క్షత్రియ కన్య కావడంచేత చిన్నప్పటినుంచి తాను శ్రీకృష్ణుని ప్రేమిస్తూ,అతన్నే పెళ్లి చేసుకోవాలని గట్టిగా నిశ్చయించుకోవడంవల్ల తన భావాన్ని శ్రీకృష్ణునికి తెలియజేస్తూ దూతను పంపింది.తల్లిదండ్రుల్ని,సోదరుని ఎదురించి అయినా తన ప్రేమను సాధించుకోవాలనుకునే సాహసం శ్రీకృష్ణునికి పంపించిన వర్తమానంలో స్పష్టమౌతుంది.

"శ్రీయుతమూర్తి! యో పురుషసింహమ! సింహము పాలి సొమ్ము గో
మాయువు గోరుచందమున మత్తుడు చైద్యుడు నీ పదాంబుజ
ధ్యాయినియైన నన్ను వడిఁదాఁ గొనిపోయెద నంచు నున్న వా
డా యధమాధముం డెఱుఁగ డద్భుతమైన భవత్ప్రతాపమున్"

(దశమస్కంధం 1706వ పద్యం)

"అంకిలి సెప్పలేదు,చతురంగబలంబులతోడ నెల్లి యో
పంకజనాభ! నీవు శిశుపాల జరాసుతులన్ జయించి నా
వంకకు వచ్చి రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే

యుంకువ సేసి కృష్ణ! పురుషోత్తమ! చేకొని పొమ్ము వచ్చెదన్"

(దశమస్కంధం 1708వ పద్యం)

రుక్మిణి శ్రీకృష్ణునికి పంపిన వర్తమానం పోతన పది పద్యాల్లో రాశారు.అందులో ఆమె శ్రీకృష్ణుని త్రికరణశుద్ధిగా ప్రేమించానని,అలాంటి తనను నక్కలాంటి శిశుపాలుడు కోరుతున్నాడని,చతురంగ బలాలతో దండెత్తి వచ్చి శిశుపాల,జరాసంధాదులను ఓడించి రాక్షస వివాహ పద్ధతిలో తనను ఎత్తుకుని వెళ్లి వివాహం చేసుకోమని,పెళ్లిరోజున తాను ఊరి బైట నున్న గౌరీదేవి ఆలయానికి వస్తానని,తనను తీసుకుని వెళ్ళమని చాలా స్పష్టంగా రుక్మిణి చెప్పిన వర్తమానం బ్రాహ్మణుడు కృష్ణునికి వివరిస్తాడు.నేటి ఆధునిక యువతిలో ఉండే సాహసం,తెగింపు రుక్మిణిలో కనిపిస్తున్నాయి.

**మంగిపూడి వారి రుక్మిణి:**

అయితే రుక్మిణీ పరిణయ నాటకకర్తలకు రుక్మిణి ఈ సాహసప్రవర్తన నచ్చలేదు. వారు ఆమెను ముగ్ధగా,లజ్జ,వినయం,సాహసం కలిగిన కన్యగా చిత్రించాలనుకొని,ఆమె తనకు తానుగా బ్రాహ్మణుని పిలిచి శ్రీకృష్ణునికి వర్తమానం పంపినట్లుగా కాకుండా రుక్మిణి ప్రేమను గమనించిన ఆమె చెలికత్తె కుముదిని కృష్ణ దర్శనానికి ద్వారకకు వెళ్తున్న కేశవశర్మను రుక్మిణి దగ్గరకు రప్పించి,రుక్మిణి శ్రీకృష్ణుని ప్రేమించిన విషయాన్ని తానే అతనికి చెప్పి,ఎలాగైనా శ్రీకృష్ణుని తీసుకుని రమ్మని చెప్పినట్లుగా మార్చి రాశారు.

ఈ నాటకంలో రుక్మిణి ముగ్ధ. సిగ్గు అధికం,వినయం,సహనం,తల్లిదండ్రులపట్ల భక్తి,సోదరునిపట్ల అభిమానం కలిగింది.అంతేకాదు గొప్ప గంభీరురాలు కూడా.చిన్నప్పటి నుంచి శ్రీకృష్ణుని గురించి కథలు కథలుగా విని అతన్ని జీవితేశ్వరునిగా అనుగ్రహించమని దేవతలకు మొక్కుకుంటూ ఉంటుంది.అయితే బిడియం ఎక్కువ. గంభీరురాలు కావడంచేత తాను శ్రీకృష్ణుని ప్రేమించినట్లుగా గానీ,మనసులో అతన్ని భర్తగా భావిస్తున్నట్లుగాగానీ ఎవరికీ చెప్పదు.సాధారణంగా అమ్మాయిలకు తల్లి దగ్గర చనువు ఎక్కువగా ఉంటుంది,కానీ రుక్మిణి ఈ నాటకంలో తన ప్రేమ విషయం తల్లికి కూడా చెప్పదు. అయితే ఎల్లప్పుడూ తనతో ఉండే ఆమె చెలికత్తెలు సరోజిని, కుముదినులకు మాత్రం ఆమె ప్రేమ గురించి తెలుసు. రుక్మిణి పెళ్లి ప్రస్తావన వచ్చినపుడు ఆమె తల్లిదండ్రులు తమ కుమారుడైన రుక్మి సలహానునసరించి ఆమెను చేది దేశపు రాజైన శిశుపాలునికిచ్చి వివాహం చేయాలనుకుంటారు. దాంతో ఆమెకు రెండు కష్టాలు వస్తాయి.ఒకటి చిన్నప్పటి నుంచి గాఢంగా ప్రేమిస్తున్న శ్రీకృష్ణుని భర్తగా పొందలేకపోవడం,రెండు తనకు ఏమాత్రం ఇష్టంలేని శిశుపాలుని వివాహం చేసుకోవలసిరావడం.ఈ రెండూ తీవ్రమైన కష్టాలే.ఇంత కష్టంలో ఉన్నప్పటికీ ఆమె తాను శ్రీకృష్ణుని ప్రేమించానన్న విషయం తల్లిదండ్రులకుగానీ, సోదరునికిగానీ చెప్పదు.అలా చెబితే తన కుటుంబం వారు తనను బరితెగించినదానిగా చిన్నచూపు చూస్తారని ఆమె భయం.లోకంలో లజ్జ,గంభీర స్వభావం కలిగినవారు ఇలాగే ప్రవర్తిస్తూ ఉంటారు.ఇలాంటివారు తమ మనసులోని భావాలను పెద్దలకు చెప్పకుండా తమలో తాము దిగులుతో కుమిలిపోతూ,తమ కోరికను తీర్చమని దేవుని ప్రార్థిస్తూ దేవుడిమీద భారంపేసి వుంటారు.దేవుడు కరుణించి చివరి

నిమిషంలో వారి కోరిక నెరవేరిస్తే సంతోషిస్తారు.నెరవేరకపోతే తమ ఇష్టానికి భిన్నంగా జరిగే అవకాశాలుంటే ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేస్తారు.ఈ నాటకంలో రుక్మిణి ఇలాంటి స్వభావం కలిగిందే.

తనకు ఇష్టంలేని వివాహం కుదిర్చిన తల్లిదండ్రుల్నిగానీ,సోదరునిగానీ ఆమె పల్లెత్తిమాట అనదు.పైగా తల్లిదండ్రులు తనకెలాంటి లోటు చేయలేదని వారిని వెనకేసుకొస్తుంది.చివరికి కుముదిని కేశవశర్మతో శ్రీకృష్ణునికి వర్తమానం పంపించాలనుకుంటే దానిక్కూడా అంగీకరించదు.చివరకు కేశవశర్మ శ్రీకృష్ణునికి ఆమె మాటలుగా ఏమి చెప్పాలో చెప్పమని కోరినప్పుడు కూడా ఆమె తన మనస్సులోని మాట చెప్పకుండా-

"మానవతీ శిరోమణికి మానము ప్రాణముకన్న మిన్న,యి
ట్లని మనోరథంబులు ఫలింపక తోయము వారిలోన స
న్మానముఁ గోలుపోయినఁ బ్రమాదము చేకురు నిక్కమన్న ప
ల్కా నిగమాంత నర్తకున కన్యలు తెల్ప నగత్య మున్నదే?"

మానవతులకు ప్రాణంకంటే గౌరవమే ముఖ్యం.తనలాంటి రాచకన్యలు అంతఃపుర ధర్మానికి భిన్నంగా ప్రవర్తించకూడదని,అలా చేస్తే తన గౌరవానికి భంగం కలుగుతుందని,ఆ విషయం సర్వజ్ఞుడైన శ్రీకృష్ణునికి తెలుసునని చెబుతుంది.కేశవశర్మ ఆమె కోరిక ఫలించాలని దీవించి వెళ్ళిపోతాడు.కృష్ణునికి వర్తమానమందించిన తర్వాత తిరిగి రుక్మిణికి కనబడడు.కాని భాగవతంలో అగ్నిద్యోతనుని వర్తమానం విన్న శ్రీకృష్ణుడు అతనితో కలిసి విదర్భకు వచ్చినట్లు,తమ్ముడు ఒంటరి అయిపోతాడని భావించి బలరాముడు ససైన్యంగా శ్రీకృష్ణుని వెనకాలే వచ్చినట్లు,వీరికి భీష్మకుడు సాదరంగా స్వాగతం పలికి విడిది ఏర్పాటు చేసినట్లుగా పోతన వర్ణించారు.విదర్భలోని ప్రజలంతా పెళ్ళికి అతిథులుగా వచ్చిన వారిలో శ్రీకృష్ణుని చూసి-

"తగు నీ చక్రి విదర్భరాజ సుతకున్ దథ్యంబు వైదర్భియుం
దగు నీ చక్రికి నింత మంచిదగునే దాంపత్య మీ యిద్దఱిం
దగులంగట్టిన బ్రహ్మ నేర్పరిగదా దర్పాహతారాతియై
మగడౌ గావుత జక్రి యీ రమణికిన్ మా పుణ్యమూలంబునన్"

అని తమలో తాము అనుకున్నట్లుగా పోతన రాశారు. అంతేకాకుండా అగ్నిద్యోతనుఁడు తిరిగి రుక్మిణి దగ్గరకు వచ్చి-

"మెచ్చె భవద్గుణోన్నతి,కమేయ ధనావళులిచ్చె నాకుఁ దా
వచ్చె సుదర్శనాయుధుడు,వాడె సురాసురు లెల్ల నడ్డమై

వచ్చినసైన రాక్షస వివాహమునం గొనిపోవు నిన్ను,నీ

సచ్చరితంబు భాగ్యమును సర్వము నేడు ఫలించెc గన్యకా!"

అని శ్రీకృష్ణుని దగ్గర నుంచి తిరిగి వర్తమానం తీసుకువస్తాడు.

కానీ ఈ నాటకంలో కేశవశర్మ రుక్మిణికి మరి కనిపించడు. అయితే శ్రీకృష్ణుడు వస్తాడో,రాడో! ఆపద నుంచి గట్టెక్కిస్తాడో లేడో అనే ఆందోళన చెందినట్లు అర్ధమౌతుంది.

వివాహంనాడు రుక్మిణి ఉమాదేవి ఆలయానికి వచ్చి తన కోరికను నెరవేర్చమని పార్వతిని ఇలా ప్రార్థిస్తుందీ నాటకంలో-

"జననం బాదిగ నీదు పాదసరసీ జాతంబు లత్యంత భ

క్తిని సేవించుచునుందెనేని ననురక్తిన్ భక్తరక్షాపరా

యణునిన్ దానవలోక శాత్రవుని మత్ప్రాణేశ్వరుండంచు నే

ననయం బెంచితినేని శాంకరి మదీయాభీష్ట మీడేర్పవే?"

**ముగింపు:**

రుక్మిణి ముగ్ధగా,కుటుంబ గౌరవం కాపాడే పరిపూర్ణ వ్యక్తిగా ఇందులో దర్శనమిస్తుంది.తన ప్రాణాలను కాపాడమని శ్రీకృష్ణుని వేడుకుంటుంది.ఆమె వేడుకున్నట్లుగానే కృష్ణుడు ఉమాదేవి ఆలయానికి వచ్చి ఆమెను తన రథం మీద కూర్చుండబెట్టుకుని,తనను ఎదిరించిన శత్రువులను జయించి ఆమెను వివాహం చేసుకుంటాడు. అత్యంత ప్రమాదంలో ఉన్న తనను రక్షించినందుకు చేతులు జోడించి అతనికి నమస్కరిస్తుంది.

**ఆధార గ్రంథాలు**

1. ఆంధ్ర నాటక సమీక్ష, శ్రీనివాస చక్రవర్తి, జయంతి పబ్లికేషన్స్, విజయవాడ, 1963.

2. కోలాచలం శ్రీనివాసరావు నాటక సాహిత్య సమాలోచనము, డా: ఎస్.గంగప్ప, శ్రీ వరలక్ష్మి ప్రెస్, హైదరాబాదు.

3. తెలుగు నాటక వికాసము, డా:పి.ఎస్.ఆర్.అప్పారావు, శివాజీ ప్రెస్, సికింద్రాబాదు, 1967.

4. బ్రహ్మశ్రీ అభినవ పోతన మంగిపూడి వేంకట శర్మగారి జీవిత చరిత్ర, కోగంటి దుర్గామల్లికార్జునరావు, విఘ్నేశ్వర గ్రంథమాల, పామర్రు, కృష్ణా జిల్లా, 1948.

5. రుక్మిణీపరిణయము, మంగిపూడి వేంకట శర్మ, ముట్నూరి వేంకట సుబ్బారాయుడు, ఆంధ్ర ప్రచారిణి ముద్రాక్షరశాల, నిడదవోలు, 1912.

6. శ్రీమద్భాగవతము, పోతన, తెలుగు విశ్వవిద్యాలయము, హైదరాబాదు, 1986.

7. తారాబాయి, దుర్భాక రాజశేఖర శతావధాని.

8. పృథ్వి రాజు-తారాబాయి, మంగిపూడి వేంకట శర్మ, చింతామణి ముద్రాక్షరశాల, 1918.

9. వీరమతి, మంగిపూడి వేంకట శర్మ.

10. సహకారవిజయము, మంగిపూడి వేంకట శర్మ, తూర్పు గోదావరి జిల్లా సహకార సమ్మేళనము వారిచే ప్రచురితము, ఆలమూరు, 1932.